# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-11-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- గ్రామీణ భారతాన్ని పట్టణాలతో అనుసంధానించడంలో పోస్టల్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది.
- బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను పుదుచ్చేరికి తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమయిందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ రోజు అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా బొమ్మనహాళ్ మండలం, నేమకల్లు గ్రామంలో పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ముందుగా నేమకల్లు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రజా వేదిక పాల్గొని గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజల కు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలుపుతూ....

(వాయిస్ 27 సెకన్లు)

=====================

గ్రామీణ భారతాన్ని పట్టణాలతో అనుసంధానించడంలో పోస్టల్ శాఖ  కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 2.6 కోట్ల రూపాయలతో నిర్మించనున్న తపాలా శాఖ ప్రధాన కార్యాలయ భవనానికి ఈరోజు ఆయన శంఖుస్థాపన చేశారు. అలాగే, ఎర్రగోండపాలెంలో నూతనంగా నిర్మించిన తపాలా కార్యాలయాన్ని రిమోట్ విధానంలో ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... పోస్టల్ శాఖను సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు మంత్రి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ పరిధిలోనినెన్నూరుపాడు గ్రామంలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచామని, అన్న క్యాంటీన్లు ప్రారంభించామని, అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్లను కూడా ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 63 లక్షల మందికి వివిధ రకాల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల పంపిణీని తిరిగి ప్రారంభిస్తామని తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతీ నెల 2 వేల 712 కోట్ల రూపాయలను ఎన్టీఆర్ భరోసా పెన్షన్లుగా అందిస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణం శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. అలాగే రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ ఈరోజు విజయనగరం జిల్లా నెల్లిమర్లలో లబ్ధిదారులకు ఎన్.టి.ఆర్.భరోసా పింఛన్లను అందజేశారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో లబ్ధిదారులకు ఫించన్లను మంత్రి గుమ్మడి సంధ్యారాణి పంపిణీ చేశారు.

=====================

లైంగిక వేధింపు నివారణా చట్టాలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు బాలలు, మహిళలకు వాటిపై అవగాహన కలిగించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈరోజు భీమవరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో అత్యాచార నిరోధక చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ.. ఈ చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సద్వినియోగం చేసుకోవడానికి వీలవుతుందన్నారు. పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో జరిగే లైంగిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

విరామం

=====================

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను గత 6 గంటల్లో గంటకు 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది ఉత్తర ఈశాన్యంగా 420 కిలోమీటర్లు, నాగపట్టణానికి ఉత్తర వాయవ్య దిశగా 200 కిలోమీటర్ల, పుదుచ్చేరికి తూర్పు ఈశాన్యంగా 120 కిలోమీటర్లు, చెన్నైకి ఆగ్నేయంగా 110 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ అధికారి పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

=====================

విశాఖ బీచ్ రోడ్ లో డిసెంబర్ 15న జరిగే నేవీ మారథాన్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టరేట్ లో నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో నేవీ మారథాన్ ఏర్పాట్లపై సమీక్షించి, పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మారథాన్‌లో సుమారు 13వేల మంది పాల్గొనే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, సమైక్యతా భావాన్ని చాటిచెప్పేందుకు నిర్వహించే ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి ఈ మారథాన్ ప్రారంభమవుతుందని, విజేతలకు బహుమతులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

=====================

ఫెంగల్ తుపాను ప్రభావంతో విశాఖ నుంచి పలు విమాన సర్వీసులను ఈరోజు రద్దు చేశారు. విశాఖ నుంచి చెన్నైకు నడపాల్సిన రెండు సర్వీసులు, విశాఖ తిరుపతి మధ్య నడిపే మరో సర్వీసును ఇండిగో విమానయాన సంస్థ రద్దు చేశామని విశాఖ విమానశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

=====================

చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని పర్యాటక హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు స్థానిక పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి చేసారు. ఎంతో ప్రఖ్యాతి గాంచిన చంద్రగిరి కోటను పరిరక్షించి, ఆధునిక యుగానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎంపీల బృందం కేంద్రమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసారు.

=====================

అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా రేపు ర్యాలీని నిర్వహించనున్నామని పార్వతీపురం మన్యం జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబి నియంత్రణాధికారి డాక్టర్ యం. వినోద్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఈ ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

=====================

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగితే ఉపేక్షించేదిలేదని అల్లూరి సీతారామరాజు  జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. ప్రధాన రహదారుల ఇరువైపుల ఆక్రమణలు జరిగితే వి.ఆర్.ఓలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయం నుండి ఐటిడి ఏ పి. ఓలు, సబ్ కలెక్టర్లు, తాహశీల్దారులు, ఎంపిడిఓలతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రహదారులు భవనాల శాఖకు చెందిన భూములు, బంజరు, గ్రామ కంఠం భూముల ఆక్రమణలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు.

=====================

=====================